క్లుప్తంగా

ఘనంగా కార్తీక తదియారాధన



తదియారాధనలో స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు, దేవస్థానం ఉద్యోగులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం కార్తీక తదియారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు, అడవివరం గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని స్మరిస్తూ సహపంక్తి భోజనం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు కార్తీక తదియారాధన విశిష్టతను వివరించారు. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, రాంబాబు, పీఆర్వో నాయుడు ఏర్పాట్లు చేశారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం తాగి వాహనం నడిపిన 13 మంది మందుబాబులకు న్యాయస్థానం ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షల జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో తాగి వాహనం నడుపుతున్న 13 మందిని పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిని బుధవారం రెండవ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, పై జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మరోసారి తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్షతగాత్రులకు పరామర్శ



క్షతగాత్రులను పరామర్శిస్తున్న పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ

పరవాడ: ఫార్మాసిటీలోని ఠాగూర్ పరిశ్రమలో విష వాయువుల లీకైన ప్రమాదంలో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జి బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు కన్నూరి వెంకటరమణ ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు




ధర్మారాయుడుపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద కల్వర్టు దుస్థితి

పరవాడ: అచ్యుతాపురం-పరవాడ రహదారిలోని ధర్మారాయుడుపేట కూడలికి సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద కల్వర్టు శిథిలమైంది. దీంతో ఈ రహదారి వెంబడి ప్రయాణాలు చేస్తున్న వాహనదారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ కల్వర్టుపై నిర్మించిన రక్షణ గోడ కూలిపోయింది. దీంతో వాహనదారులు దీనికి సమీపంలోకి వచ్చే వరకు కల్వర్టు ఉందన్న విషయం గమనించలేని పరిస్థితి. రహదారిలో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు పక్కన ఒకవైపు కల్వర్టుకు రక్షణ గోడ లేని కారణంగా రాత్రి వేళ ప్రయాణాలు సాగించే వాహనాలు అదుపు తప్పితే కల్వర్టు గోతిలో పడడం ఖాయం. కల్వర్టు దుస్థితిని గుర్తించి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి, రక్షణ గోడను ఏర్పాటు చేయాలని పరిసర గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అరుగాలం శ్రమించి సాగు చేసిన రైతన్నకు చేను కల్లానికి చేరితేనే సంతోషం. ఈ ఏడాది ఖరీఫ్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు ఆశించిన స్థాయిలోనే పంట చేతికి అందేలా ఉంది. ప్రస్తుతం నియోజకవర్గంలో వరి చేను కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇంతలో ఫెంగల్ తుపాను ప్రభావం రైతుల్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే మండల వ్యవసాయ అధికారులు రైతుల్ని అప్రమత్తం చేశారు. రెండుమూడు రోజులు కోతలు ఆలస్యమైతే పర్లేదు గానీ.. అంతకు మించి జాప్యం జరిగితే గింజలు నేలరాలి, పంట నష్టం తప్పదని రైతులు **చెప్తున్నారు. ఈ చి'వరి'గండం గట్టెక్కితే చాలనుకుని దేవుళ్లను వేడుకుంటున్నారు.**

చివరి గండం!



వరి కుప్పలు పెడుతున్న రైతులు

- నియోజకవర్గంలో ఊపందుకున్న వరి కోతలు
- దిగుబడిపై రైతాంగం కొండంత ఆశలు
- ఫెంగల్‌ప్రభావంపై అన్నదాతల్లో ఆందోళన
- ధాన్యం కొనుగోలుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

పెందుర్తి: నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లో రైతులు పొలం బాటలో బిజీ అయ్యారు. ఓ వైపు కోతలు.. మరోవైపు చేను కల్లానికి చేర్చి కుప్పలు పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం 40–50 శాతం కోతలు జరిగాయి. మరో వారం రోజుల్లో వరి కోతలు పూర్తవుతాయి. అయితే ఫెంగల్ తుపాను ప్రభావంపై రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చేను కల్లాలకు చేరుకునే కీలక దశలో తుపాను హెచ్చరికలు వీరికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం వరికి మద్దతు ధర ప్రకటించినా.. ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వలేదు. వారం పది రోజుల్లో ప్రకటన చేస్తామని అధికారులు చెబుతున్నారు.

సాగు ఆశాజనకమే.. కానీ...

ఖరీఫ్ వరి సాగు	
మండలం	ఎకరాలు
పెందుర్తి	1,555
సబ్బవరం	3,500
పరవాడ	325

పెందుర్తి నియోజకవర్గంలో ఈ ఏడాది మొత్తం 5,370 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశారు. ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు, నాట్లు తర్వాత అధిక వర్షాలు కాస్త ఇబ్బంది పెట్టినా, చివరి సాగు ఆశాజనకంగానే ఉంది. ప్రస్తుతం అన్నిచోట్ల వరి చేను పూర్తిస్థాయిలో కోత దశకు చేరుకుంది. ముందుగా సాగు ప్రారంభించిన సుమారు 2 వేల ఎకరాల్లో కోతలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన చోట తుపాను ప్రభావం ఉపశమిస్తే మరో వారం రోజుల్లో కోతలు పూర్తయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం పంట పరిస్థితిని చూసి, దిగుబడి బాగుంటుందని రైతులు ఆశాజనకంగా ఉన్నారు. కోతలు ఆలస్యమైతే మాత్రం పంట నష్టం తప్పదు. దీనికి తోడు తుపాను వల్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిస్తే మరింత కష్టం. పంట చేను నేలకొరిగి నష్టం అంచనా వేయలేనంతగా పెరిగే అవకాశం ఉంది.



గొరపల్లిలో కోతలు కోస్తున్న మహిళలు

ధాన్యం సేకరణపై అస్పష్టత

వాతావరణం సానుకూలంగా మారి, కోతలు పూర్తయితే ఇక మిగిలింది నూర్పులే. ఒకటీ అర చోట్ల యంత్రాల సాయంతో నూర్పిడి ప్రక్రియ ప్రారంభించారు. ప్రభుత్వం ధాన్యం సేకరణ మద్దతు ధర ప్రకటించింది. అయితే నియోజకవర్గంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలను మాత్రం ప్రారంభించలేదు. దీంతో ఇప్పుడే నూర్పిడి చేసి, ధాన్యాన్ని నిల్వ చేసే కంటే కొనుగోలు కేంద్రాలు మొదలయ్యాక నూర్పిడి చేసి, కల్లాల నుంచే కొనుగోలు కేంద్రాలకు తరలించేయొచ్చన్న ఆలోచనలో చాలా మంది రైతులున్నారు. అందుకే నూర్పుళ్లు పెద్దగా మొదలుకాలేదు. కల్లాల సౌకర్యం లేకపోవడంతో, వ్యవసాయ క్షేత్రాల్లోనే కుప్పలు వేసిన వారు ప్రభుత్వ తాత్సారంపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దళారులు రైతులతో బేరసారాలు మొదలెడుతున్నారు. నూర్పులు ప్రారంభం కాగానే ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలించేలా అడ్వాన్స్‌లు కూడా ఇస్తున్నారు.

ధాన్యం మద్దతు ధర	
ధాన్యం రకం	ధర(రూ.లలో)
ఏ గ్రేడ్ 100 కిలోలు	2,320
ఏ గ్రేడ్ 75 కిలోలు	1,740
సాధారణ 100 కిలోలు	2,300
సాధారణ 75 కిలోలు	1,725

తుపాను ప్రభావంపై ఆందోళన

పంట కీలక దశకు చేరుకున్న సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు మూడు రోజులుగా చిన్నపాటి గాలులు వీస్తుండడంతో రైతులు పంట గురించి దిగులుపడుతున్నారు. శనివారం వరకు దీని ప్రభావం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఇప్పటికే కోతలు పూర్తయిన చోట చేను పూర్తిగా ఎండకపోయినా కల్లాలకు తరలించి, కుప్పలు పెడుతున్నారు. కొన్నిచోట్ల వరిచేను పక్వానికి వచ్చినా వర్షాలు పడతాయన్న ఆందోళనతో కోతలు నిలుపుదల చేశారు. తాజా పరిస్థితిపై ఎప్పటికప్పుడు అధికారులు తగిన సూచనలు సలహాలు అందిస్తున్నారు.



రాంపురంలో కోసి, ఆరబెట్టిన వరిచేను



వరిచేలను కల్లానికి తరలిస్తున్న వ్యవసాయ కూలీలు

దళారులను నమ్మొద్దు



మండలంలో పంట పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చింది. ఇప్పటికే కోతలు జరిగిన చోట కుప్పలు పెట్టుకోవాలని రైతులకు సూచించాం. ఒకవేళ కోతలు కోసే ఆలోచన ఉంటే రెండు మూడు రోజులు ఆగాల్సిందిగా చెబుతున్నాం. పరిస్థితి చూసుకుని పంట దిగుబడి ప్రయోగం చేస్తాం. ప్రస్తుత పరిస్థితి బట్టి మంచి దిగుబడులే వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. మరో వారం పది రోజుల్లో సరిపల్లి, పినగాడిలో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. దళారులను నమ్మి ఎవరూ అడ్వాన్స్‌లు తీసుకోవద్దు.

– టి.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి, పెందుర్తి

సాయినాథరావుకు పరామర్శ



రాజేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

సబ్బవరం: అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన సాయినాథరావు చిన్న కుమారుడు రాజేష్ అకాల మరణంతో వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరామర్శించారు. మండలంలోని ఎరుకునాయుడు పాలెంలో ఉన్న సాయినాథరావు స్వగృహంలో రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు జానకిరామరాజు, దంతులూరి దిలీప్ కుమార్, అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు బర్నికాన రామారావు, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, పార్టీ సీనియర్ నాయకులు మోపాడ అప్పారావు, వనం అచ్చెంనాయుడు, కర్రి అప్పారావు, బలిరెడ్డి కనకరాజు, దాసరి ఈశ్వరరావు, దాడి సత్తిబాబు, ధూళి నరేష్, దాసరి మధు తదితరులు ఉన్నారు.

'పీఎం సూర్యఘర్'పై అవగాహన సదస్సు నేడు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన–ముఫ్త్ బిజిలీ యోజన కార్యక్రమాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ అవగాహన సదస్సులో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థపై గ్రామస్తులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు వల్ల వ్యక్తిగత గృహాలకు, వ్యవసాయ యూనిట్లకు కలిగే ప్రయోజనాలను వివరిస్తారని పేర్కొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే ఉత్తమ భవిత

పరవాడ: లక్ష్య సాధన కోసం విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలని అజినిమోటో బయో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ కేకే రాజు అన్నారు. పరవాడ బాలుర జెడ్పీ హైస్కూల్లో రీసస్టైనబిలిటీ సహకారంతో రాంకీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల ఉన్నప్పుడే సామాన్యమైన వ్యక్తులు కూడ ఉన్నత శిఖరాలను చేరుకోగలరన్నారు. ఫార్మాసిటీ ఎండీ పి.పి.లాల్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉత్తమ భవిష్యత్ సాధ్యమన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి, సీఈవో ఎం.వాసుదేవరెడ్డి, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పాఠశాల హెచ్‌ఎం బి.అప్పలనాయుడు, విద్యా కమిటీ అధ్యక్షుడు చుక్క ఉమ, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, రీసస్టైనబిలిటీ హెచ్‌ఆర్ బాలాజీ, హెచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



ల్యాబ్‌లో కంప్యూటర్‌ను ఆన్ చేస్తున్న అజినిమోటో బయో ఫార్మా ఎండీ కేకే రాజు

వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ధర్నాలో వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న సిటు జిల్లా ఉపాధ్యక్షురాలు మణి

- సిటు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద వలంటీర్ల ఆందోళన


పెందుర్తి: గ్రామ, వార్డు వలంటీర్లకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మణి మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, బకాయి వేతనాలను చెల్లించాలని, రూ.10 వేల వేతన హామీని నెరవేర్చి, జాబ్ చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బలవంతంగా రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు.

గత ప్రభుత్వం వలంటీర్లకు కనీస వేతనాలు, పని గంటలు సరిగ్గా అందించకుండా అవార్డులు, ప్రశంసలకే పరిమితం చేసిందని తప్పుబట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాజకీయ ఒత్తిడి కారణంగా వలంటీర్లకు అన్యాయం జరిగిందని, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిటు జిల్లా కార్యదర్శి బి.జగన్, జోన్ నాయకులు కె.అప్పలనాయుడు, బి.రమణి, ప్రభుదేవా, మహేష్ రాజు, వలంటీర్ల సంఘం నాయకులు రూప, దేవి, సావిత్రి, రత్నకుమారి, ప్రసాద్, రాజశేఖర్, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా, గ్రామాభివృద్ధి

- జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో గృహ వినియోగదారులకు విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గడంతోపాటు, పంచాయతీలకు నిధులు పెరిగి గ్రామాభివృద్ధి జరుగుతుందని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని గుల్లేపల్లిలో సూర్యఘర్ పథకం అమలుపై గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం అమలులో ప్రథమ స్థానంలో నిలిచిన గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.కోటి నిధులు మంజూరవుతాయన్నారు. సౌర విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకునే గృహానికి రూ.వెయ్యి చొప్పున పంచాయతీ ఖాతాకు నిధులు జమ కానున్నట్లు తెలిపారు. ఈ నిధులను పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్ మాట్లాడుతూ నెలకు 120 యూనిట్లు వినియోగించే గృహాలకు ఏడాదికి సుమారు రూ.8 వేలు, 240 యూనిట్లు వినియోగించే ఇంటికి రూ.20 వేలు, 360 యూనిట్లు వినియోగించేవారికి రూ.78 వేలు వరకూ ఆదా అవుతుందన్నారు. భవిష్యత్ అంతా పునరుత్పాదక ఇంధన వనరులదేనని, ఆ దిశగా ప్రతి కుటుంబం సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ముందుకు రావాల్సిందిగా కోరారు. గ్రామ ప్రగతికి ఇంటింటికీ సౌర విద్యుత్ వ్యవస్థను అమర్చుకోవాలని సూచించారు. దీంతో భవిష్యత్ తరాలకు ఇదే స్థాయిలో ఇంధన వనరుల్ని మిగిలించిన వారిమవుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోకం రామునాయుడు, బండారు మంగ, డీఈ నిరంజన్ అంబేడ్కర్, ఏఈలు వీరేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

తీరు మారకపోతే వేటు

- జనవరి 1నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం
- అనధికార నిర్మాణాలపై అధిక ఫిర్యాదులు
- ప్లానింగ్ సెక్రటరీల పనితీరు బాగాలేదు
- వార్డు కార్యదర్శుల అలసత్వం సహించను
- జోన్–8 సమీక్షలో జీవీఎంసీ కమిషనర్



సమీక్షలో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్





పాల్గొన్న జీవీఎంసీ అధికారులు, జోన్–8 అధికారులు, వార్డు కార్యదర్శులు

సింహాచలం: జీవీఎంసీ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు, నగరాభివృద్ధిలో కీలక బాధ్యత జోనల్ అధికారులదేనని, విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదని జీవీఎంసీ కమిషనర్ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ హెచ్చరించారు. సింహాచలంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో బుధవారం జీవీఎంసీ జోన్–8 అభివృద్ధి, ప్రజల సమస్యలపై జోనల్‌స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జోనల్ స్థాయి సమస్యలు, అభివృద్ధి పనులను జెడ్సీ హైమావతి, విభాగాధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషనర్‌కి వివరించారు.

సమన్వయంతో పనిచేయండి

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు జోన్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, నూతన పనుల ప్రతిపాదనలపై సమన్వయంతో పనిచేయాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు, మౌలిక వసతుల కల్పన ప్రాధాన్యతాంశాలన్నారు. గ్రావెల్ రోడ్లు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మేరకు తారు రోడ్లను వేయాలన్నారు. వర్షాలకు గెడ్డలు పొంగిపొర్లకుండా పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. జోన్ పరిధిలో ఉన్న 26 పార్కులు, 26 శ్మశాన వాటికలను వీలైనంత తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేయాలన్నారు. అన్ని సామాజిక భవనాలు వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధిలైట్లు శతశాతం వెలగాలన్నారు.

ప్లానింగ్ విభాగంపై అసంతృప్తి

టౌన్ ప్లానింగ్ విభాగంపై జరిగిన సమీక్షలో కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణలు, అనధికార కట్టడాలపై పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, ప్లానింగ్ సెక్రటరీల పనితీరు బాగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. జీవీఎంసీ నుంచి బిల్డింగ్ ప్లాన్‌ని సులభంగా పొందవచ్చన్న విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కోర్టు ధిక్కరణ, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నందున సీఎం పేషీ నుంచి వివరణ కోరుతున్నారని తెలిపారు. అక్రమ, అనధికార నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను అరికట్టాలన్నారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం

యూసీడీ విభాగం ద్వారా వెల్ఫేర్ కార్యదర్శులు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలు, బ్యాంకు లోన్లు తదితర విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 తర్వాత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించాలని, దీనిపై 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచి శత శాతం వ్యర్థాలు సేకరించి డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా విశాఖ నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికను శానిటరీ సెక్రటరీ రూపొందించుకోవాలని సూచించారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఈ పి.శివప్రసాదరాజు, సీసీపీ ఎ.ప్రభాకరరావు, డీసీఆర్ ఎస్.శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజినీర్ రామ్మోహనరావు, టౌన్‌ప్లానింగ్ సీపీ మీనాకుమారి, డీసీపీ రామ్మోహన్, యూసీడీ ప్రాజెక్టు అధికారి బి.రమణమ్మ, కార్యనిర్వాహక ఇంజినీర్లు చిరంజీవి, శ్రీధర్, సహాయ వైద్యాధికారులు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ అప్పలనాయుడు, ఏపీడీ చిరంజీవి, ఏసీపీ రామలింగేశ్వర రెడ్డి, ఆర్‌ఐలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో అనపర్తి ఎమ్మెల్యే

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని అనపర్తి ఎమ్మెల్యే ఎస్.రామకృష్ణారెడ్డి బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, చిత్రపటాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

రాయితీపై విత్తనాలు, ఎరువుల పంపిణీ

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో రబీ సీజన్‌కు సంబంధించి రాయితీపై అపరాల విత్తనాలు, ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి, ఏపీ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి చేతుల మీదుగా రైతులకు వీటిని అందించారు. రాయితీపై వేరుశనగ, మినుప, పెసర, కొర్రలు విత్తనాలతో పాటు, పొటాషియం, ద్రవరూప జీవన ఎరువు ట్రైకోడెర్మా విరిడి, జీవ శిలీంద్ర నాశిని తదితర మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తమరాన బంగారి నాయుడు, అంగటి నానాజీ, గండి నరేష్, శ్రీరాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలను పంపిణీ చేస్తున్న గండి బాబ్జి

ప్రమాదకరంగా గొయ్యి.. భయంగా రాకపోకలు



గోతిపై అడ్డంగా వేసిన ముళ్ల కంపలు

పరవాడ: మండలంలోని పి.బోనంగి–కలపాక రహదారిలో మరిశవానిపాలెం చెరువు వద్ద ఏర్పడిన భారీ గుంత ప్రయాణికులను నిత్యం భయపెడుతోంది. చెరువు వద్ద పంట పొలాలకు నీరందించేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టు కొన్నేళ్ల క్రితం పాడైంది. మరమ్మతు చేయకుండా వదిలేశారు. ఆ తర్వాత భారీ వర్షాలకు చిన్న గొయ్యి కాస్తా పెద్ద గుంతగా మారింది. ఎన్టీపీసీ, హిందూజా సిబ్బందితోపాటు, ఉప్పుగల్లీల్లో పనిచేసే కార్మికులు ఈ రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సాయంత్రం విధులు ముగించుకుని ఇళ్లకు చేరే క్రమంలో చీకటి పడ్డాక ఈ గోతిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో వీధి దీపాలు కూడా లేవు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురికాక తప్పదు. దీంతో ఈ గొయ్యి చుట్టూ స్థానికులు ముళ్ల పొదలు కంచెగా వేశారు. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి అధికారులు గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.